
శ్రీ శంకరాచార్య విరచితమ్
శ్రీ కామాక్షీ స్తోత్రమ్
- భావార్థముతో. -

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A, గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.

https://madhirafamily.wordpress.com/



Kiron Type Institute

కోరిన కోర్కెలు తీర్చే కంచి కామాక్షి దేవి

(సమస్త భూమండలానికి నాభి ఈ క్షేత్రం) దర్శనం తోనే కష్టాలను తీర్చే తల్లి

హిందూ ధర్మంలో శివకేశవులతో సమానంగా అమ్మవారు కూడా వివిధ రూపాలలో పూజలను అందుకుంటుంది. తనను నమ్మి కోరి కొలిచిన భక్తులపై కరుణ చూపిస్తూ, కన్న బిడ్డలను కాపాడినట్లు తమను కాపాడుతుందని భక్తుల విశ్వాసం.

కాంచీపురంలో వెలసిన కామాక్షి తల్లిని దర్శించుకోవడానికి ఎన్ని సార్లు భక్తులు సంకల్పించుకున్నా, వెళ్లలేరని, తల్లి కరుణ ఉంటేనే అమ్మవారి దర్శనం సాధ్యమని విశ్వాసం. సమస్త భూమండలానికి నాభి స్థానమే కాంచీపురం. మనం తల్లి గర్భంలో ఉన్నపుడు మనం తల్లి నాభినుండే పోషింపబడతాము. అదే విధంగా కంచి కామాక్షిని దర్శించుకున్న భక్తులను కూడా ఎటువంటి కష్టం లేకుండా పోషిస్తుందని భక్తుల విశ్వాసం.

ఉత్తర భారతదేశంలో హిమాలయాలలో ఒకప్పుడు కాత్యాయన మహర్షి పరమశివుడి గురించి తపస్సు చేసాడు. శంకరుడు ప్రత్యక్షమై నీకు ఏమి కావాలి అని అడుగగా, మహర్షి అమ్మవారిని నా కూతురుగా చేసుకోవాలి అని వుంది అనే కోరికను వెలిబుచ్చాడు. శంకరుడు తథాస్తు అని అంతర్ధానమయ్యాడు. మహర్షి అలాగే తపస్సులో ఉండగా ఒక రోజు బోసి నవ్వులు నవ్వుతూ అత్యంత సౌందర్యరాశి అయిన ఒక చిన్న పిల్ల పాక్కుంటూ వచ్చి ఆయన తొడలమీద చేయివేసి ఆయనను బహిర్ముఖుడిని చేస్తుంది. అప్పుడు ఆయన కన్నులు తెరచి అమ్మవారే కుమార్తెగా వచ్చిందని భావిస్తారు. కాత్యాయన మహర్షికి కుమార్తెగా వచ్చింది కాబట్టి ఆ తల్లి పేరు కాత్యాయని అయ్యింది. కాత్యాయనికి యుక్త వయస్సు వచ్చింది. మహర్షికి పరమేశ్వరుని తెచ్చి ఎలా వివాహం చెయ్యాలో అర్థం కాలేదు.

అప్పుడు మహర్షి కాత్యాయనిని పిలిచి, నేను నీకు పులి చర్మం, కుంభం, సింహాసనం, గంగ, కొంత ఇసుక, రుద్రాక్షమాల, ఇద్దరు పరిచారికల్ని, ఒక శివ లింగాన్ని, విసినకర్రని, ఒక నాగుపామును, ఒక యోగదండాన్ని, ఒక చిలుకను ఇస్తాను. ఇవి తీసుకుని బయలుదేరు. నువ్వు నడచి వెళుతుండగా ఎక్కడ ఇవన్ని అకస్మాత్తుగా చెట్లైపోతాయో, అక్కడ నీకు నీ భర్త లభిస్తాడు అని గుర్తు. అక్కడ ఆయన కోసం తపస్సు చేయి అని మహర్షి చెప్తారు.

అలా కాత్యాయని నడచి వెళుతూ వుండగా కాంచీపురంలో మహర్షి ఇచ్చిన వస్తువులు అన్ని చెట్లుగా మారిపోయాయి. అక్కడ అమ్మవారు రోజూ సైకత లింగాన్ని చేసి పరమశివుని కొరకు పూజ చేసేవారు. ఈశ్వరుడు అమ్మవారిని పరీక్షించదలచి పక్కన వున్న వైదేహీ (గంగానది) ప్రవాహం పొంగి ఈ సైకతలింగం దగ్గరకి కదిలింది. (శివ పరీక్షలో భాగంగా తాను పూజించే సైకత లింగాన్ని శివకల్పితమైన నదీ ప్రవాహం నుంచి రక్షించుకోవడానికి

...10

శ్రీ కామాక్షీ స్తోత్రమ్ - భావార్థముతో.

01. కల్పనోకహ పుష్పజాల విలసన్నీలాలకాం మాతృకాం
కాంతాం కంజదళేక్షణాం కలిమల ప్రధ్వంసినీం కాళికాం
కాంచీనూపురహార హీరసుభగాం కాంచీపురీనాయకీం
కామాక్షీం కరికుంభసన్నిభకుచాం వందే మహేశప్రియామ్॥

జగన్మాతగా, దట్టమైన కేశపాశములతో కల్పతరువుగా, కోరికలను తీర్చే కల్పవల్లిగా, పద్మములవంటి నేత్రములు కలిగి అదే సమయంలో కలియుగంలో దుష్ట శిక్షణకు కాళీ రూపముదాల్చి, వడ్డాణము, అందెలు, పుష్పమాలలు ధరించి, మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీదేవిని ప్రార్థిస్తున్నాను.

02. మాయామాదిమకారణం త్రిజగతామారాధితాంఘ్రిద్వయా-
-మానందామృతవరిదాసి జగతాం విద్యాం విపద్దుఃఖహాం
మాయామానుషరూపిణీ మణిలసన్మధ్యాం మహామాతృకాం
కామాక్షీం గజరాజ మందగమనాం వందే మహేశప్రియామ్॥

మాయా స్వరూపముతో, మూడులోకముల వాసులు అర్చించే పాద పద్మములు కలదై, అమృత స్వరూపిణిగా కొలువై, వజ్రపు కాంతితో సగుణరూపముతో దర్శనమిస్తూ, గజగమనంతో చరించే మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

03. కాశాభాం శుకసుప్రభాం ప్రవిలసత్కోశాతకీ సన్నిభాం
చంద్రార్కానలలోచనాం సురచితాలంకారభూషోజ్జ్వలాం
బ్రహ్మ శ్రీపతి వాసవాదిమునిభిః సంసేవితాంఘ్రిద్వయాం
కామాక్షీం పరిపూర్ణచంద్రవదనాం వందే మహేశప్రియామ్॥

గరిక రంగులో మెరిసే చిలుకను ధరించి, స్వయంగా చంద్రకాంతి సమానంగా భాసిస్తూ, సూర్య చంద్ర అగ్నులను మూడు నేత్రములుగా కలిగి, బ్రహ్మ, విష్ణు, ఇంద్రాది దేవతలు, మునులచే ఆరాధించబడుతూ, గజగమనంతో చరించే మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

04. ఐం క్లీం సౌమితియాం వదంతి
మునయస్తత్వార్థరూపాం పరాం
వాచామాదిమకారణాం హృది సదా
ధ్యాయంతి యాం యోగినః
బాలాం ఫాలవిలోచనాం నవజపావర్ణాం సుషుమ్నాలయాం
కామాక్షీం సకలార్తిభంజనపరాం వందే మహేశప్రియామ్॥

ఐం క్లీం సౌః బీజ మంత్రాలతో మునులచే స్తుతించబడుతూ, యోగులు తమ హృదయములలో ఆరాధిస్తూ, మూడవ నేత్రం కలిగి, బాలాత్రిపుర సుందరిగా అర్చించబడుతూ, మందార పుష్ప వర్ణంతో సుషుమ్నా నాడిలో వసించి, భాగ్య ప్రదాత, మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

05. యత్పాదాంబుజరేణులేశమనిశం లబ్ధ్వా విధత్తే విధిః
విశ్వం తత్పరిపాతి విష్ణురఖిలం యస్యాః ప్రసాదాచ్చిరం।
రుద్రస్సంహరతి క్షణాత్తదఖిలం యాన్మాయయా మోహితం
కామాక్షీం మతిచిత్రచారుచరితాం వందే మహేశప్రియామ్॥

ఏ తల్లి పాద ధూళిని శిరసున ధరించిన తరువాత మాత్రమే బ్రహ్మదేవుడు సృష్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తాడో, ఎవరి దయతో విష్ణువు సమస్త విశ్వాన్ని సంరక్షిస్తాడో, ఏ మాయాశక్తి వలన ఈశ్వరుడు సకల విశ్వాన్ని లయం చేస్తాడో, ఎవరి కరుణాపూరిత చర్యలు అన్నివైపులకు ప్రసరిస్తాయో, మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

06. వాగ్దేవీమితి యాం వదంతి మునయః క్షీరాబ్ధికన్యామితి
క్షోణీభృత్తనయామితి శ్రుతిగిరో యామామనంతి స్ఫుటమ్।
ఏకామేవ ఫలప్రదాం బహువిధాకారాం తనుం బిభ్రతీం
కామాక్షీం కవిభిర్నుతాం చ సుభగాం
వందే మహేశప్రియామ్॥

సరస్వతీ స్వరూపముగా, క్షీరాబ్ధికన్యక లక్ష్మిగా, భూజాత సీతగా, వేదములను సృజించినదిగా, అనేక మూర్తిరూపములతో, ఫలమును ప్రసాదించే మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

07. సూక్ష్మాం సూక్ష్మతరాం సులక్షితతనుం క్షాంతాక్షరైర్లక్షితాం
వీక్షాశిక్షితరాక్షసాం త్రిభువనక్షేమంకరీమక్షరాం।
సాక్షాల్లక్షణలక్షితాక్షరమయీం దాక్షాయణీం సాక్షిణీం
కామాక్షీం శుభలక్షణైస్సులలితాం వందే మహేశప్రియామ్॥

సూక్ష్మము కంటే సూక్ష్మమై, నశ్వరమై, పవిత్రమైన రూపము కలదై, రాక్షసులను సంహరించి త్రిభువనములకు క్షేమంకరిగా, ధ్యానములో దర్శనమిచ్చే దాక్షాయణిగా, శుభలక్షణములతో ప్రకాశించే మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

08. హ్రీంకారాత్మకమాతృవర్ణపఠనాద్వైంద్రీం శ్రియం తన్వతీం
చిన్మాత్రాం భువనేశ్వరీమనుదినం భిక్షాప్రదానక్షమాం।
విశ్వాఘౌఘనివారిణీం విజయినీం విశ్వంభరాం పార్వతీం
కామాక్షీమమృతాన్నపూర్ణకలశాం వందే మహేశప్రియామ్॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

హ్రీంకార శబ్దరూపమును స్మరించినంత మాత్రముననే సకల శక్తులను ప్రసాదిస్తూ భువనేశ్వరీ దేవిగా అన్ని పాపములను తొలగించి వరములను ప్రసాదిస్తూ, మచ్చలేని పవిత్ర మూర్తియై, పూర్ణచంద్రుని కాంతితో ప్రకాశించే, మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

09. ఓంకారాంకణవేదికాముపనిషత్ప్రాసాదపారావతాం
ఆమ్నాయాంబుధిచంద్రికా మఘతమః ప్రధ్వంసినీం సుప్రభాం
కాంచీపట్టణపంజరాంతరశుకీం కారుణ్యకల్లోలినీం
కామాక్షీం శివకామరాజమహిషీం వందే మహేశప్రియామ్॥

పర్వతాగ్రములలో ఉపనిషద్ భావములలో కాంతి స్వరూపమైన ఓంకారము వలె ప్రకాశిస్తూ, చతుర్వేదముల ప్రకాశరూపమై, ఆత్మరూపమును జ్వలింపచేస్తూ, కాంచీపురమనే పంజరములో కొలువైన చిలుకగా, కర్మస్వరూపుడైన మహేశ్వరునకు ప్రియమైనది అయిన శ్రీ కామాక్షీ దేవిని ప్రార్థిస్తున్నాను.

10. కాంతాం కామదుఘాం కరీంద్రగమనాం
కామారివామాంకగాం
కల్యాణీం కలితాలకాళిసుభగాం కస్తూరికాచర్చితాం।
కంపాతీరరసాలమూలనిలయాం కారుణ్యకల్లోలినీం
కామాక్షీం సుఖదాంచమే భగవతీం వందే మహేశప్రియామ్॥

భక్తానుగ్రహకారిణిగా, కామధేనువువలె, భక్తుల అన్ని కోరికలను తీరుస్తూ, అర్ధనారీశ్వర స్వరూపిణిగా, కస్తూరీ సుగంధముతో, కంపా నదీ తీరంలో, మామిడి చెట్టు క్రింద దయాస్వరూపురాలై, వెలసిన కాంచీపుర దేవతకు నమస్కరిస్తున్నాను.

11. స్నాత్వాక్షీరాపగాయాం సకలకలుషహృత్సర్వతీర్థే ముముక్షుః
లక్ష్మీకాంతస్య లక్ష్మ్యా వరదమభయదం పుణ్యకోటీవిమానే।

కామాక్షీం కల్పవల్లీం కనకమణిభాం కామకోటీ విమానే
కాంచ్యాం సేవేకదాహం కలిమలశమనీం
నాథమేకాంబ్రనాథమ్॥

12. చూళీచుంబితకేతకీదళశిఖాం చూతప్రవాళాధరాం
కాంచీశింజితకింకిణీముఖరిణీం కాంచీపురీనాయకీం।
కారుణ్యామృతవాహినీ ముపనమద్గీర్వాణనిర్వాణదాం
కామాక్షీం కమలాయతాక్షి మధురామారాధయే దేవతామ్॥

13. పక్వాన్నప్రతిపాదనాయ పదయోర్నాదేన మంజీరయో–
–రార్తానామఖిలంధనం తనుభృతామాహూతిమాతన్వతీ।
ఏకాంబ్రస్థలవాసినః పశుపతేరేకాంతలీలాసఖీ
కంపాతీర తపశ్చరీ విజయతే కాంచీపురీదేవతా॥

14. కస్తూరీ ఘనసారకుంకుమలసద్వక్షోజకుంభద్వయాం
కేయూరాంగదదివ్యరత్నవిలసద్భూషోజ్జ్వలాం సుస్మితాం।
కాంచీధామ నిబద్ధ కింకిణిరవైర్భక్తాఘభీతాపహాం
కామాక్షీం కరిరాజ మందగమనాం వందే గిరీశప్రియామ్॥

15. కామాక్షీం కుటిలాలకాం ఘనకృపాం కాంచీపురీదేవతాం
ఏకామ్రేశ్వర వామభాగనిలయాం మృష్టాన్నదాం పార్వతీం।
భక్తానామభయప్రదాంబుజ కరాం పూర్ణేందుబింబాననాం
కంఠే కాంచనమాలికాం శివసతీమంబామజస్రం భజే॥

16. కేయూరాంగదదివ్యరత్నవిలసద్భూషోజ్జ్వలాం సుస్మితాం
కోటీరేవిలసత్సుధాంశు శకలాం కోకస్తనీం కోమలాం।
హస్తాబ్జే కమనీయకాంచనశుకాం కామారిచిత్తానుగాం
కామాక్షీం నితరాం భజామ వరదాం కాంచీపురీదేవతామ్॥

17. వందే శంకరభూషణీం గుణమయీం సౌందర్యముద్రామణిం
వందే రత్నవిభూషణీం గుణమణిం చింతామణిం సద్గుణాం।
వందే రాక్షసగర్వసంహరకరీం వందే జగద్రక్షణీం
కామాక్షీం కరుణాకటాక్షవిభవీమంగీకరీ పాహిమామ్॥

18. హేరాణీ గిరిజే త్రిమూర్తి విభవే నారాయణీ శంకరీ
గౌరీ రాక్షసగర్వసంహరకరీ శృంగారహారాధరీ।
శ్రీకైలాసనివాసినీ గిరిసుతా వీరాసనే సంస్థితా
కామాక్షీ కరుణాకటాక్షవిభవీమంగీకరీ పాహిమామ్॥

19. ఛందోభాషితశంకరీ ప్రియవధూర్దేవైస్సదా శోభితా
లక్ష్మీ కేశవయోర్విభాతి సదృశా వాణీవిధాత్రోస్సమా।
మాణిక్యోజ్జ్వలపాదపద్మయుగళధ్యానే సదా శోభితా
కామాక్షీ కరుణాకటాక్షవిభవీమంగీకరీ పాహిమామ్॥

20. గంధర్వైశ్శృతిభిస్సదాఽసురసురైర్బ్రహ్మాదిదిగ్పాలకైః
వేదైశ్శాస్త్రపురాణవిప్రపఠితై స్తోత్రైస్సదా ధ్యాయినీ।

సర్వేషాం సకలార్థ్యభీష్టఫలదాం స్తోతుస్సదా పార్వతీ
కామాక్షీ కరుణాకటాక్షవిభవీమంగీకరీ పాహిమామ్॥

21. కాంచీపురాధీశ్వరి కామకోటికామాక్షి కంపాతటకల్పవల్లి।
ఏకాంబ్రనాథైకమనోరమేత్వమేనం జనం రక్ష కృపాకటాక్షైః।

కంపా నదీ తీరాన కల్పవల్లిగా కామకోటులను తీర్చే కామాక్షిగా, కాంచీపురధీశ్వరిగా, ఏకాంబరేశ్వరుని ప్రియ దేవేరిగా వెలసిన శ్రీ కామాక్షీ దేవిని కృపా కటాక్షములను ప్రసరిస్తూ జనులందరినీ కాపాడవలసినదిగా ప్రార్థిస్తున్నాను.

// ఇతి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య కృత శ్రీ కామక్షీ స్తోత్రం సంపూర్ణమ్ //

(కొన్ని శ్లోకాలకు మాత్రమే భావం దొరకడంతో అంతవరకే సేకరించడం జరిగింది. మిగిలినవి ఎవరికైనా అందుబాటులో ఉంటే తెలియజేయగలరు)

– – – = – – –

కామాక్షీ దేవి మహా మంత్రము

“ ఓం క్లీం హ్రీం క్లీం ఐం క్లీం సౌః హ్రీం శ్రీం కామాక్షీ
కామదాయిని సకల జనవశంకరి సకలైశ్వర్య ప్రదే
శ్రీ హ్రీం సౌః క్లీం ఐం క్లీం హ్రీం శ్రీం ఓం హ్రీం ఫట్ స్వాహాః”

– – – = – – –

సైకత లింగాన్ని ఆలింగనంతో (కౌగిలితో) కాపాడుకుంటుంది. అలా ఆలింగనం చేసుకున్నపుడు అమ్మ గాజుల మరియు కుచముల ముద్రలు ఇప్పటికి అక్కడ శివలింగంపై దర్శనమిస్తాయి అని ఒక కథనం.) అప్పుడు అమ్మవారు తన దగ్గర ఉన్న పరిచారికల్లో ఒకామె 'కాళి' కేసి చూడగా, కాళి తన బాహువులతో అడ్డినా ఆ వైదేహి ప్రవహించి లోపలకు వస్తోంది. అప్పుడు ఆవిడ కాంచీలో ఉన్న వరదరాజ స్వామిని ప్రార్థించగా శ్రీ మహావిష్ణువు ఆ గంగా ప్రవాహాన్ని ఆపేరు. అప్పుడు ఆ శివలింగ స్వరూపం ఏమి కాకూడదనే అ తల్లి సైకతలింగాన్ని కౌగలించుకున్నది. అప్పుడు ఆ లింగంలో నుండి పరమశివుడు ఏకాంబరేశ్వరుడు అనే నామధేయముతో ఆవిర్భవించి ఆమెను పరిణయమాడాడు.



ఇక్కడ స్థల పురాణం ప్రకారం – ఒకనాడు పార్వతీదేవి శివుని కన్నులు మూసింది. శివుడు తన కన్నులే సూర్య చంద్రాగ్నులని తెలుపుతూ నేత్రములను వదలమని చెప్పగా పార్వతీదేవి తన చేతులను వెంటనే తీసివేసింది. తన కన్నులను మూసినది క్షణకాలమైన లోకానికది అనేక సంవత్సరాలుగా పరిగణించ బడింది. ఎటువంటి వెలుతురు లేకపోవడంతో వినాశనం సంభవించింది. తన వలన జరిగిన ధర్మలోపానికి చింతించి, ప్రాయశ్చిత్తం చేసుకోవటానికి శివుని అనుమతి తీసుకుని పార్వతి దేవి భూలోకంలోని కాంచీపుర క్షేత్రంలో కంపానది తీరాన ఒక మామిడి చెట్టు క్రింద ఆభరణాలను విసర్జించి రుద్రాక్షమాలను ధరించి శివ పంచాక్షరీ జపిస్తూ ఇసుకతో లింగాన్ని (సైకితలింగం) చేసి ఒంటికాలు మీద తపస్సు ప్రారంభించింది. స్థల పురాణం ప్రకారం కాత్యాయనీ దేవి పరమేశ్వరుణ్ణి భర్తగా పొందడానికి తపస్సు చేసిన క్షేత్రం కాంచిపురం.

కాంచీపురంలోని కామాక్షి తల్లిని సుగంధ కుంతలాంబ అవతారంలో కూడా భక్తులు దర్శించుకోవచ్చు. ఈ రూపంలో అమ్మవారు ఎక్కడా దర్శనమివ్వరు. అంతేకాదు – సుగంధ కుంతలాంబను దర్శించుకున్న మహిళలకు అఖండ సౌభాగ్యం లభిస్తుందని నమ్మకం.

ఈ క్షేత్రంలో విఘ్నాల కధిపతి గణేశుడు "ఢంకా వినాయకుడు"గా దర్శనమిస్తాడు. ఏకాంబరేశ్వర, సుగంధ కుంతలాంబ ల కళ్యాణ మహోత్సవాన్ని ఢంకా భజాయింపుతో అందరికి తెలియ జేస్తాడు.

ఈ క్షేత్రంలో మరో విశిష్టత ఏమిటంటే – కామాక్షిదేవి ఆలయంలో ఉత్సవ కామాక్షి తల్లి విగ్రహానికి ఎదురుగా ఉన్న గోడలో తుండిర మహారాజు ఉంటారు. (శివుడికి ఎదురుగా నంది ఎలాగో అమ్మకు అలా).

Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా వెలుగొందుతున్న కామాక్షి దేవి ఆలయం తమిళనాడులోని కాంచీపురంలో కొలువై ఉంది. కంచిలోని శక్తి పీఠాన్ని నాభిస్థాన శక్తిపీఠం అంటారు. 'క' అంటే సరస్వతి రూపం. 'మా' అనేది లక్ష్మీదేవి రూపం. 'అక్షి' అంటే కన్ను అని అర్థం. దీని పూర్తి అర్థం కంచిలో అమ్మవారు సరస్వతి లక్ష్మిలను రెండు కన్నులుగా చేసుకుని అవతరించింది అని ప్రతీతి. ఈ దేవి అనుగ్రహాన్ని పొందాలంటే లలితాసహస్రనామ జపం జరపడమే అనువైన మార్గం. దేవి కంచిలో మట్టితో చేసిన శివుని విగ్రహానికి పూజ చేసేదని అప్పుడు శివుడు పెద్ద అలలతో కంబనది రూపంలో వచ్చాడట. దేవిని పరీక్షించేందుకు అలల ఉధృతిని పెంచగా ఆ దేవి తన రెండు చేతులలో విగ్రహాన్ని ఉంచుకుని అలల నుంచి కాపాడిందని ఇక్కడి స్థల పురాణం. దేవి సూదిమొనపై కూర్చొని పంచాగ్నుల మధ్య నిలబడి శివుడిని పూజించగా దానికి సంతసించి ఆమె ఎదుట ప్రత్యక్షమై వివాహమాడినట్లు ప్రతీతి.

కామాక్షి దేవి ఆలయాన్ని గాయత్రీ మండపంగా పిలుస్తారు. ఇక్కడ అమ్మవారు శ్రీ కామాక్షి, శ్రీ బిలహాసం, శ్రీ చక్రం అనే మూడు రూపాలలో దర్శనమిస్తారు ఆలయంలోని అమ్మవారి విగ్రహం పద్మాసనం వేసుకుని కూర్చొనట్లు మలిచారు. దేవి తన చేతులతో పాశం, అంకుశం, పుష్పబాణం, చెరకుగడలతో దర్శనమిస్తుంది. ఈ రూపంలో ఉన్న అమ్మ వారిని దర్శనం చేసుకుంటే శాంతి, సౌభాగ్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం.

ఇక్కడి అమ్మవారు చాలా ఉగ్రరూపంలో బలి కోరుతుండటంతో ... ఆది శంకరాచార్యులు అమ్మవారి ఉగ్రత తగ్గించేందుకు శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారని చెబుతారు. ఇక్కడ ఆ శ్రీచక్రానికి పూజలు జరుగుతాయి. అమ్మవారిని ఆ దేవాలయ ప్రాంగణం వీడి వెళ్లొద్దని ఆదిశంకరాచార్యులు అభ్యర్థించిన కారణంగా ఉత్సవ కామాక్షి ప్రాంగణంలోనే ఉన్న ఆయన అనుమతి తీసుకుని ఉత్సవాలకు దేవాలయ ప్రాంగణం నుంచి బయటకు వస్తుందని మరో కథ ప్రాచుర్యంలో ఉంది.

కామాక్షీదేవి ఇక్కడ ఐదు రూపాల్లో కొలువై ఉన్నారు. గాయత్రీ మంటపంలో కొలువై ఉన్న అమ్మవారిని మూలదేవతగా పరిగణిస్తారు. ఈ మండపంలో నాలుగు గోడలను నాలుగు వేదాలుగా, 24 స్థంభాలను గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలుగా భావిస్తారు. తపో కామాక్షి, అంజనా కామాక్షి, స్వరణ కామాక్షి, ఉత్సవ కామాక్షి అనే మరో నాలుగు రూపాల్లో ఇక్కడ దేవి కొలువై ఉన్నారు.

- - - × - - -





(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. --- 994 994 1430 OR 944 044 9650)